www.vastavam.in

# వాస్తవం.ఇన్

డిజిటల్ పత్రిక

ఎడిటర్: దండుగుల శ్రీనివాస్

News you can trust

| ఆదివారం | 29-06-2025 |

## ఇరిగేషన్ శాఖను భ్రష్టు పట్టించిన కేసీఆర్

- ప్రాజెక్టుల నిర్వహణను పట్టించుకోని నాటి పాలకులు
- జూరాల ప్రాజెక్టును సందర్శించిన మంత్రి ఉత్తమ్



**వాస్తవం, గద్వాల:**

పదేళ్ల కేసీఆర్ పాలనలో ఇరిగేషన్ శాఖని భ్రష్టు పట్టించారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లపాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాజెక్టులకు మాజీ సీఎం కేసీఆర్ మెయింటనెన్స్ చేయలేదని మండిపడ్డారు. శనివారం జూరాల ప్రాజెక్ట్‌ని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి, కాంగ్రెస్ నేతలు సందర్శించారు. ప్రాజెక్ట్ క్రస్ట్ గేట్లను, 4,8 గేట్స్ ఐరన్ రోప్‌లను పరిశీలించారు. అనంతరం మీడియాతో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో కమిషన్లకు కక్కుర్తి పడ్డారని ఆరోపించారు.

# కమలం రథసారథి డా.లక్ష్మణ్..!

ఎంతెంతదూరం ఇంకెంతదూరం అనుకుంటు వస్తున్న బీజేపీ అధ్యక్ష పదవి ఎట్టకేలకు మరో 24 గంటల్లో తేలిపోనుంది. అధ్యక్ష పదవిని సీనియర్ నాయకులకే కట్టబెట్టాలని అధిష్టానవర్గం నిర్ణయించినట్లు తెలుస్తోంది. పార్టీలో గ్రూపుల తగాదాలు లేకుండా, వివాదాలకు తావు లేకుండా అందరికీ ఆమోదయోగ్యమైన వ్యక్తికి పట్టం గట్టే అవకాశం ఉంది. ఈ క్రమంలో గత కొన్ని రోజులుగా డాక్టర్ కే లక్ష్మణ్ పేరు తెరముందుకు వచ్చింది. మొదటి నుంచి అధ్యక్ష పదవి రేసులో మాజీ మంత్రి ఈటల రాజేందర్, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వంటి పేర్లు రేసులో ఉన్నప్పటికీ గ్రూపుల తగాదా పెరిగే అవకాశం ఉన్నందున లక్ష్మణ్ పేరు అనూహ్యంగా తెరమీదకు వచ్చింది. ప్రస్తుతం కేంద్ర పార్టీలో కీలక పాత్ర పోషిస్తున్న లక్ష్మణ్ గతంలో కూడా అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన హయాంలో పార్టీ పెద్దగా దూసుకుపోనప్పటికీ వివాదాలకు తావు లేకుండా సాఫీగా సాగింది. ఈ పార్టీ మొదటి నుంచి అటు లక్ష్మణ్, ఇటు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కనుసన్నల్లోనే నడుస్తున్నది. వారిద్దరు చాలా అంశాలలో ఏకాభిప్రాయంతో ఉంటారు. ప్రస్తుత పరిస్థితుల్లో డా.లక్ష్మణ్‌కు పగ్గాలు అప్పగించడమే సరైన మార్గమని కిషన్‌రెడ్డి కూడా భావించినట్టు సమాచారం. మేధావిగా ముద్రపడ్డ డా.లక్ష్మణ్‌కు ఇవ్వడం గ్రూపులు గ్రూపులుగా చీలిపోయిన బీజేపీ మళ్లీ ఏకతాటిపైకి వస్తుందని అధిష్టానవర్గం భావిస్తోంది.



**మ్యాడం మధుసూదన్**
**(సీనియర్ పాత్రికేయులు)**


వాస్తవానికి ఒకదశలో ఈటల రాజేందర్ పేరు దాదాపుగా ఖరారైంది. కానీ గ్రూపుల సీనియర్ నాయకులతో పాటు, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి మొదటి నుంచి పనిచేస్తున్న నాయకులు వ్యతిరేకించారు. ఈటలకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అండగా నిలిచారు. ఈటల రాజేందర్‌కు అధ్యక్ష పదవి ఇవ్వడం వల్ల ఆయనకున్న రాజకీయ అనుభవం, సామాజిక సమీకరణలు కలిసి వస్తాయని భావించారు. అతిపెద్ద ముదిరాజ్ సామాజికవర్గంతోపాటు రెడ్డి వర్గం కూడా కలిసి వస్తుందన భావించారు. పార్టీలో ఉన్న రెడ్లు, బీసీలు కానీ ఆయనకు అండగా నిలవలేకపోయారు. అప్పటికే వేళ్లూనుకుపోయిన నాయకులు మరో కొత్త నాయకుడు కావడం వల్ల సమస్యలుంటాయని భావించగా, ఆరెసెస్, విశ్వహిందూ పరిషత్ వంటి సంస్థల నుంచి ఈటల మద్ధతు లభించలేదు.

ఈటలకు ప్రజాబలం ఉన్నప్పటికీ, పార్టీ బలం లేదని ప్రచారం జరిగింది. పైగా సిద్ధాంతపరంగా మూలాలు అధ్యక్ష పదవికి అడ్డంకిగా మారాయి. ఇటీవల కాళేశ్వరం విచారణలో గత కేసీఆర్ ప్రభుత్వాన్ని పూర్తిగా ఈటల సమర్థించారని పార్టీలో కొంతమందికి గిట్టలేదు. అదే సమయంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని ఆయన దుమ్మెత్తిపోశారు. ఈటల రాజేందర్‌కు పగ్గాలు అప్పజెప్పడం

## తప్పితే ఈటల, బండి ...!!

### గ్రూపు తగాదాలు లేకుండా లక్ష్మణ్‌కు చాన్స్







వల్ల ఇన్నాళ్లూ జీవితమంతా పార్టీని నమ్ముకుని ఉన్నవాళ్లు సెట్‌బ్యాక్ కావాల్సివస్తుందని వాదన బలంగా తెరముందుకు వచ్చింది. ఈ క్రమంలో గతంలో డైనమిక్‌గా వ్యవహరించిన బండి సంజయ్ పేరు తెరముందుకు వచ్చింది. కానీ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ బండి సంజయ్ పట్ల అనుకూలంగా ఉన్నప్పటికీ కొన్ని నివేదికల ఆధారంగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆయనకు మద్ధతుగా నిలవడం లేదు. పార్టీ మరోసారి ఉరకలెత్తాలంటే బండి సంజయ్‌కే పగ్గాలప్పగించాలన్న ఈ మధ్యలో బాగా పెరిగింది. కానీ అమిత్ షా సుముఖంగా లేకపోవడంతో ఆయన సెట్‌బ్యాక్ కావాల్సి వచ్చింది. బండి సంజయ్ దూకుడు వల్ల పార్టీ బలపడ్డప్పటికీ గ్రూపులు కూడా పెరుగుతున్నాయని సీనియర్లు సైతం అభ్యంతరం వ్యక్తం చేసినట్టు సమాచారం.

### పరిశీలనలో లేని 'రాజాసింగ్'

ఈ మధ్యలో మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, మరో సీనియర్ నాయకుడు ఆచారి, రఘునందన్, అర్వింద్ పేర్లు వచ్చినప్పటికీ అవి కేవలం మీడియాకే పరిమితమయ్యాయి. రాజాసింగ్ కూడా తనకు అధ్యక్ష పదవి కావాలని డిమాండ్ చేస్తున్నారు. కానీ ఆయన పేరు పరిశీలనలో లేదు. పార్టీలో ఏకాభిప్రాయం లేకపోవడం వల్ల బండి సంజయ్, ఈటల రాజేందర్ గ్రూపుల మధ్య విభేదాలు తీవ్ర స్థాయికి చేరడంతో అధిష్టానవర్గం సంకటంలో పడింది. ఎవరికి నాయకత్వం అప్పజెప్పినా మరో వర్గానికి గిట్టకపోవచ్చని, కొత్త సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వాయిదా వేస్తూ వస్తున్నారు. అధ్యక్ష పదవి ప్రకటించేందుకు కేంద్ర అధిష్టాన వర్గం అంతా ఆసక్తి చూపలేదు.

### అధిష్టానం మాటను కాదనలేక..

ఇక ఈ నేపథ్యంలో అధ్యక్ష పదవి చేపట్టడానికి అవసరమైతే సిద్ధంగా ఉండాలని అధిష్టానవర్గం డా.లక్ష్మణ్‌కు సంకేతాలు ఇస్తూ వస్తున్నది. ఇప్పటికే జాతీయ ఓబీసీ సెల్ అధ్యక్షుడిగా, రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర ఎలక్షన్ కమిటీ సభ్యుడిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న డా.లక్ష్మణ్ మొదట్లో విముఖంగా ఉన్నప్పటికీ అధిష్టానవర్గం మాటను కదలేకపోయారు. కానీ ఒక బలమైన బీసీ నాయకుడికి పగ్గాలు అప్పజెప్పి 2029లో అధికారంలోకి రావాలనుకుంటున్న బీజేపీ అధిష్టాన వర్గం మొదట గ్రూపు సమస్యలు లేకుండా చేయడానికి లక్ష్మణ్‌ను తెరమీదకు తెచ్చాయి. ఇప్పటికూడా, ఈటల రాజేందర్, బండి సంజయ్ పేర్లు పరిశీలనలో ఉన్నాయని, డా.లక్ష్మణ్ కాని పక్షంలో మొదటి చాన్స్ ఈటల రాజేందర్‌కు, తప్పితే బండి సంజయ్‌కు ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# మీడియా ముసుగులో వ్యక్తిత్వ హననం..!

### నా కుటుంబ సభ్యులపై తీవ్ర దుష్ప్రభావం చూపుతున్నాయి..!!

### ఒక్కడినీ వదలా.. చట్ట పరంగా చర్యలు తీసుకుంటా..!



**వాస్తవం ప్రతినిధి - హైదరాబాద్:**

టెలిఫోన్ టాపింగ్ వ్యవహారంలో తనతోపాటు పార్టీ నేతలపై అడ్డగోలుగా దుష్ప్రచారం చేస్తున్న వారికి బీఆరెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చాడు. అబద్ధాలు అసత్యాలు దురుద్దేశపూర్వక ప్రచారాలు చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించాడు. కొంతమంది వ్యక్తులు మీడియా ముసుగులో కావాలనే ఇలాంటి నీచమైన దుష్ప్రచారం చేస్తున్నారన్నాడు. కావాలని కొన్ని మీడియా సంస్థలు మరియు కొంతమందితో జట్టు కట్టి ఒక ముఠాగా మారి చేస్తున్న దుష్ప్రచారంపై చట్టపరంగా తగిన సమాధానం చెబుతామని పేర్కొన్నాడు. గత కొన్ని నెలలుగా కొంతమంది విలేకరుల వేషం వేసుకున్న కొంతమంది మీడియా సంస్థల యజమానులు నా పైన వ్యక్తిగతంగా, మా బిఆర్ఎస్ పార్టీ నాయకత్వంపై విషం చిమ్ముతున్నారన్నారు. అలాంటి వ్యక్తుల వల్ల కానీ వారు వ్యక్తపరుస్తున్న నీచమైన అభిప్రాయాలు నాపైన వ్యక్తిగతంగా ఎలాంటి ప్రభావం చూపించవని, కానీ పదేపదే వీరు చేస్తున్న వ్యక్తిత్వ హననం వలన తన కుటుంబ సభ్యుల పైన తీవ్రమైన దుష్ప్రభావం చూపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశాడు. మీడియా రూపంలో వీరు చేస్తున్న దాడులు నా శ్రేయోభిలాషులు, పార్టీ నాయకులను, పార్టీ శ్రేణులను బాధ కలిగిస్తున్నాయన్నాడు. వారి ఒక్కొక్కరిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటానని హెచ్చరించాడు. కలిసికట్టుగా వెనుక ఉండి నడిపిస్తున్న వారితోపాటు, దుర్మార్గపూరితంగా ఇలాంటి నీచమైన ప్రయత్నాలు చేస్తున్న ప్రతి ఒక్కరికి తగిన రీతిలో చట్టపరంగా ఎదుర్కొంటామని వెల్లడించాడు.

# రేవంత్ జగమొండి...!

### వద్దని వారించినా కంచ గచ్చిబౌలి భూములను వదలని సీఎం..!!

**అక్కడ ఐటీ టవర్లు నిర్మించి తీరుతానని ప్రకటన..**

**ఐదు లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఆ భూములను వినియోగించుకుంటానని వెల్లడి..**

**మరో 30వేల ఎకరాల్లా భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ప్లానింగ్..**

**తన హయాంలో రేవంత్ మార్కు పాలన కోసం తండ్లాట..!**



**(దండుగుల శ్రీనివాస్)**

తను అనుకన్నది చేసే వరకు వదలడం లేదు సీఎం రేవంత్‌రెడ్డి. జగమొండిగా పాలనను ముందుకు సాగిస్తున్నాడు. ఆది నుంచి ఆయన వైఖరి అలాగే ఉంది. హైడ్రా విషయంలో కూడా దూకుడుగా పోయి తరువాత కొంత వెనకడుగు వేసినా.. ఆ తరువాత ఆయన తన మార్కు పాలన కోసం తండ్లాడుతున్నట్టు కనిపిస్తోంది. తాజాగా రేవంత్ మళ్లీ కంచ గచ్చిబౌలి విషయంలో తన స్టాండ్ మార్చుకోలేదనే విధంగా కామెంట్స్ చేయడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో ప్రభుత్వం బద్నాం అయ్యింది. దీనిపై రాజకీయాలకు అతీతంగా ఒక్కటయ్యారు. ఆ భూముల్లో వన్యప్రాణులున్నాయని, ఆ చెట్లను నరకొద్దని హై కోర్టు కూడా జోక్యం చేసుకుని మొట్టికాయలు వేసినా.. రేవంత్ మదిలో మాత్రం ఆ భూముల అంశం పోలేదు. వాటిలో ఐటీ టవర్లు నిర్మించి ఐదు లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తానని మళ్లీ ప్రకటించాడాయన. దీంతో పాటు శంషాబాద్ విమానాశ్రయం అవతల మరోమ 30వేల ఎకరాల్లో కూడా భారత్ ఫ్యూచర్ సిటీ కోసం ప్లాన్ చేస్తున్నట్టు ప్రకటించాడు. తన హయాంలో ఎప్పటికీ గుర్తుండి పోయేలా.. రేవంత్ ఈ విధమైన నిర్ణయాలు తీసుకుంటన్నాడనిపిస్తోంది. రియల్ ఎస్టేట్ రంగంలో అపారమైన అనుభవం ఉన్న రేవంత్., ఐటీ పరిశ్రమల స్థాపన ద్వారా రియల్ రంగాన్ని దూకుడుగా ముందుకు తీసుకుపోవాలని చూస్తున్నాడు. ఇప్పటికే ఫ్యూచర్ సిటీ పేరుతో ఆయన అక్కడ నిర్మాణాలు చేపట్టినా.. అది పెద్దగా ముందుకు సాగడం లేదు. దీనిపైనా తాజాగా అధికారులతో సమావేశం పెట్టి దిశానిర్దేశం చేశాడాయన. ఇప్పుడు మళ్లీ కంచ గచ్చిబౌలి భూములతో పాటు, మరో 30వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని అంకురార్పణ చేస్తున్నాడు. బీఆరెస్ ఏదైతే వద్దని రాజకీయం చేస్తున్నదో.. దాన్ని ఆయన తిప్పికొట్టే క్రమంలో మొండిగా ముందుకే పోతున్నాడనిపిస్తోంది.